

ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ అధ్యక్షురాలు నౌహీరా షేక్

పాతబస్తీని గోల్డ్ సిటీ చేస్తా...

● ఏఐఎంఈపీ అధ్యక్షురాలు నౌహీరా షేక్

పంజాగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీని గోల్డ్ సిటీ చేస్తానని ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ(ఏఐఎంఈపీ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ నౌహీరా షేక్ అన్నారు. నగరం, పాతబస్తీ, శివారు ప్రాంతాల్లో భూకబ్జాలు, రౌడీయిజం పెరిగాయని, అభివృద్ధికి నోచుకోలేదని ఆమె ఆరోపించారు. దేశ వ్యాప్తంగా పలు దశల్లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగు వందల ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తున్నామని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలలో అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలుపుతున్నామని ఆమె ప్రకటించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ మాస్క్, నాయకులతో కలిసి ఎన్నికల మేనిఫెస్టోను ఆమె విడుదల చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి తాను స్వయంగా పోటీ చేస్తున్నానని ఆమె తెలిపారు. సమావేశంలో చేవెళ్ల, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాలను పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఇమామ్ హుస్సేన్, ఎస్.నవ్యజ మ్యూకాశ్మీర్ ఇన్‌చార్జి ఎంఏ నజీమ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి సంస్థ వార్షికోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి హిమజ

అందరూ ఆర్గానిక్ వైపు మళ్లుతున్నారు

● సినీ నటి హిమజ

అమీర్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తినే ఆహారం విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకుంటూ ఆర్గానిక్ ఆహార పదార్థాల వైపు పరుగులు తీస్తున్నారని ఇది చాలా మంచి పరిణామమని సినీనటి హిమజ అన్నారు. ప్రకృతి సంస్థ తొలి వార్షికోత్సవం సోమవారం ఎస్ఆర్‌నగర్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హిమజ జ్యోతి ప్రజ్వలన చేసి సంస్థ వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిత్యావసరాలు, పండ్లలో క్రిమిసంహారక మందులు వాడడంతో ప్రజల ఆరోగ్యం పాడవుతుందని, ఆర్గానిక్ ఉత్పత్తులు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న జబర్దస్త్ నటులు దొరబాబు, రైజింగ్ రాజు, శాంతి స్వరూప్ ఎలు సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు జాఫర్, సాధిక్, సురేష్, శ్రీనాధ్ రెడ్డి, అమృశ్రీ, నర్మద, సుబ్బారావు పాల్గొన్నారు.



టీఎస్ఎస్పీడీసీఎల్‌లో అధికారులను కలిసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లు

మార్చి వరకు ఎల్‌వోసీ బిల్లులు చెల్లించాలి

● టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులను కలిసిన ప్రైవేట్ కాంట్రాక్టర్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో మార్చి నెల వరకు ఉన్న ఎల్‌వోసీ బిల్లులు చెల్లించాలని, ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచాలని ప్రైవేట్ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి, మార్చి నెలవరకు కాంట్రాక్టర్లకు రావాల్సిన రూ. 124 కోట్లు రిలీజ్ చేయాలని సోమవారం ఖైరతాబాద్‌లోని టీఎస్ఎస్పీడీసీఎల్ ప్రధానకార్యాలయంలో కొంతమంది ప్రైవేట్ కాంట్రాక్టర్లు టీఎస్ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో కొంత ఆలస్యం జరిగిందని, ఫిబ్రవరి నెల వరకు ఉన్న ఎల్‌వోసీ రిలీజ్ చేస్తామని ఇన్‌చార్జి ఫైనాన్స్ డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు.

ఆరోగ్య తెలంగాణే తమ లక్ష్యం

● మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అందరు ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఆరోగ్య తెలంగాణ కోసం కృషి చేస్తున్నామని ఐటీ, లెజిస్లేటివ్ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆర్గాలా రివైవ్ వైద్య పునరావాస కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఎవరు ఆస్పత్రులకు రాకుండే ఉండాలన్నదే తమ అభిమతమన్నారు. ఫిజియోథెరపీ సేవల వల్ల రోగులకు చికిత్స ముందు, తర్వాత పునరావసాన్ని సులభతరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్గాల హెల్త్ సర్వీస్ సంస్థ ఎండి డాక్టర్ శ్రీదేవి యడవల్లి పాల్గొన్నారు.



విద్యుత్ లేని తరగతి గదిలో విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీకట్లోనే పరీక్షలు

బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు కరెంట్ నిలిపివేసి ఐదురోజులైనా ప్రిన్సిపాల్ స్పందించడం లేదని విద్యార్థుల తల్లి దండ్రులు వాపోతున్నారు. స్థానిక నాయకులు కొందరు ఎంఈవోకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది.

తెలంగాణ సెయిలర్లకు 9 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సెయిలింగ్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ సెయిలర్లు తొమ్మిది పతకాలు కొల్లగొట్టి సత్తా చాటారు. నల్లకుంటకు చెందిన యువ సెయిలర్ గోవర్ధన్ అండర్-15 కేటగిరీలో టైటిల్ కైవసం చేసుకోగా, బేగంపేటకు చెందిన బన్నీ కాంస్యం సాధించాడు. రసూల్‌పూరకు చెందిన కె.దీక్షిత రజతం, లహరి కాంస్యం గెలిచారు. అండర్-18లో వైష్ణవి స్వర్ణం, డబుల్స్‌లో తనూజ-గణేష్ జోడీ రజతం, అండర్-17లో ధరణి-మల్లేష్ ద్వయం రజతం నెగ్గారు.



పోటీల్లోని దృశ్యం

బధిరులకు భరోసా

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్న ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థ ● ఐదేళ్లుగా టెన్త్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత

బంజారాహిల్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వారంతా చెవిటి, మూగ, బధిర చిన్నారులు. మనసులోని భావాలను ఇతరులకు చెప్పాలనుకుంటారు... కాని వారి సైగలు సామాన్యులు అర్థం చేసుకోలేరు. ఇలాంటి వారిని అర్థం చేసుకొని వారి మనసెరిగి కొత్త స్ఫూర్తిని నింపుతుంది శ్రీనగర్‌కాలనీలోని ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థ. వారిలో ఉన్న ప్రతిభకు మెరుగులు దిద్దుతూ మేము సైతం మా కాళ్లపై నిలబడగలుగుతాం అంటూ బధిరుల్లో భరోసా కలిగిస్తోంది. ఐదు సంవత్సరాలుగా సంస్థ నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరైన వారిలో వంద శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అందరూ 8 గ్రేడ్ కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకొని తాము ఎవరికీ తీసి పోమని నిరూపిస్తున్నారు.



విద్యార్థులకు వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రత్యేక తరహా శిక్షణ..

విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు సంస్థ అనేక వినూత్న పద్ధతుల్లో వారికి శిక్షణ ఇస్తోంది. ఈ శిక్షణ తీసుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసిస్తున్నారు. ఎర్లీ ఇంటర్వేషన్, స్పీచ్ థెరపీ, ఆడిటరీ ట్రైనింగ్, ఆడిటరీ వెర్బల్ థెరపీ, ఓరల్ అవురల్ మెథడ్ ఆఫ్ టీచింగ్ యాక్టివిటీస్, విసిట్స్, పిక్చర్స్, కంప్యూటర్ ఎడ్యుకేషన్ అనేక రకాలుగా శిక్షణ లు ఇచ్చి వారిలో కొత్త చైతన్యాన్ని నింపుతారు. అనంతరం వారికి విద్యను బోధిస్తారు. దీన్ని కూడా కొన్ని రకాల పద్ధతుల్లో బోధిస్తుంటారు. వీటి ద్వారా బధిర పిల్లలు ఎటువంటి ఇబ్బంది లేకుండా అర్థం చేసుకోగలుగుతారు.

చదువుతోపాటు విద్యార్థులకు కరాటే, డ్యాన్స్ క్రాఫ్ట్‌ల విభాగంలో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మల్టీమీడియా కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇలా అనేక రకాలుగా శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. అర్చన అనే బధిర విద్యార్థి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేసింది. రాధిక అనే విద్యార్థిని మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ జేఎన్ఎఫ్ఏయూలో పూర్తి చేశారు. ఏడుగురు విద్యార్థులు మైసూర్‌లో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యనభ్యసిస్తున్నారు.

1996లో అంకురార్పణ..

పుట్టుకతో సోదరుడు బధిరుడు. అతనితో పాటు మిగతా బధిరులు పడే కష్టాలను చూసిన సంఘ సేవకుడు డీపీకె బాబు ఎలాగైనా వారి కోసం ఓ సంస్థను ఏర్పాటు చేయాలని నిశ్చయించుకున్నాడు. విద్యాబుద్ధు లతో పాటు వారిలో కొత్త చైతన్యం తీసుకురావాలనే ఆయన ఆకాంక్ష 1996లో నెరవేరింది. శ్రీనగర్‌కాలనీలో ఆశ్రయ్-ఆకృతి సంస్థను నెలకొల్పారు. పది మందితో ప్రారంభమైన సంస్థ ప్రతి సంవత్సరం కనీసం 130 మంది బధిర విద్యార్థులకు అక్కున చేర్చుకుంటుంది. వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక తరహా శిక్షణ ఇస్తూ అనేక మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతోంది. సంస్థను విస్తరిస్తూ మరో మూడు చోట్ల కూడా శాఖలను ఏర్పాటు చేసి ఆర్థిక స్థోమత లేని వారి కోసం హాస్టల్ వసతిని కూడా కల్పిస్తోంది.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

బధిర విద్యార్థులకు బాసటగా నిలవాలనే

బధిర విద్యార్థులకు బాసటగా నిలవాలనే ఉద్దేశంతోనే సంస్థను నెలకొల్పాం. వీరిలో కొత్త స్ఫూర్తిని నింపి వారిని ప్రయోజకులుగా చేయడం ఆనందంగా ఉంది. వారి మనస్సును అర్థం చేసుకుంటూ అందుకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాం. దాతలు కూడా బధిర విద్యార్థులకు సాయం అందించేందుకు ముందుకు వస్తున్నారు.

- డీపీకే బాబు, సంస్థ డైరెక్టర్



అలుపెరగని పోరాటం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ ఆర్థిక, రాజకీయ, సామాజిక విశ్లేషకులు పాపారావు

కేంద్రాన్ని ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐ దాడులు

● రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు

పంజాగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలను ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐ దాడులు చేసి జైలుకు పంపుతున్నారని ప్రముఖ ఆర్థిక ,రాజకీయ, సామాజిక విశ్లేషకులు డి.పాపారావు అన్నారు. ప్రతిపక్ష నాయకులను ఎన్నికల సందర్భంగా జైల్లో పెట్టడం అంటే వారిని పోటీలో లేకుండా చేసి గెలిచేందుకే చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవ తెలంగాణ బుక్ హౌస్ ప్రచురించిన ప్రబీర్ పుర్కాయస్థ పుస్తకాన్ని ఆయన కామ్రేడ్ జితిన్,నవ తెలంగాణ బుక్ హౌస్ మేనేజర్ వాసుతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్ యూట్యూబ్ చానల్ ద్వారా ప్రజా, కార్మిక సమస్యలు ప్రజలందరికీ తెలియజేసినటువంటి గొప్ప పోరాట యోధుడు ప్రబీర్ అన్నారు. ఆయన రచించిన అలుపెరుగని పోరాటం నాటి ఎమర్జెన్సీ నుంచి నేటి మోదీ ప్రభుత్వం అనుసరించే అప్రకటిత ఎమర్జెన్సీ వరకు వివిధ అంశాలను పుస్తకంలో వివరించాడన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలు, వాటిని ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐ దాడులు చేసి జైలుకు పంపుతున్నారన్నారు. దేశంలో మీడియా మొత్తం ఆర్ఎస్ఎస్, బీజేపీ చేతిలో ఉందనన్నారు. కార్యక్రమంలో ప్రబీర్ సహచరులు అంబేడ్కర్, సృజన, సీపీఎం నాయకులు సీహెచ్. చంద్రశేఖర్ రావు, ఆర్.అశోక్, స్వామి, భిక్షపతి, హనుమంతురావు,పాపారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అక్షయపాత్ర ఫౌండేషన్‌ను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఎలక్ట్రిక్ వాహనాలు

నార్సింగ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ కేంద్రీకృత వంటశాల ఆధునీకరణకు జెమిని ఎడిబుల్స్ సంస్థ మూడు ఎలక్ట్రిక్ వాహనాలను సోమవారం అందజేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెమిని ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు, ట్రస్టీ సత్యగౌర చంద్రదాసు హాజరై ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యగౌర చంద్రదాసు మాట్లాడుతూ నార్సింగ్‌లో వంటశాలను అధునీకరించడమన్నది మా లక్ష్యసాధనలో మరో ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. ఈ వ్యూహాత్మక పునర్నిర్మాణం 37,000 మందికి రోజూ వండే ప్రస్తుత వంటశాల సమర్థ్యాన్ని 50 వేలుకు పెంచుతున్నదని ఆయన పేర్కొన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ భారతదేశంలోని 16 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 72 వంటశాలల ద్వారా 24,082 పాఠశాలల్లోని 20లక్షల మంది పిల్లలకు ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్‌జీవో సంస్థ నిర్వహించే పాఠశాల భోజన కార్యక్రమంగా నిలిచిందని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం అక్షయ పాత్ర ఫౌండేషన్ సీఈవో శ్రీధర్ వెంకట్ మాట్లాడుతూ జెమిని ఎడిబుల్స్ సంస్థ అందించిన ఈ సహకారాన్ని ఎన్నడూ మరవలేమన్న ఆయన, జెమిని ఎడిబుల్స్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జెమిని ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అక్షయపాత్ర వాళ్లు చేస్తున్న సేవలు ఎప్పటికి మరువలేమని కొనియాడారు. అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు తమవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.



హైదరాబాద్ ఖైరతాబాద్ హిందీ పండిట్ ఆడిటోరియంలో మంచి పుస్తకం ఆవిష్కరణలో యడ్లపల్లి వెంకటేశ్వరరావు, అశ్వినీ కుమార్, సురేష్

బాల సాహిత్యం కోసం మంచిపుస్తకం

● మంచిపుస్తకం రెండు దశాబ్దాలు సంకలనం ఆవిష్కరణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పుస్తకాలపై ప్రేమ, తెలుగులో చదివే సామర్థ్యం పెంచే ఉద్దేశంతో మంచి పుస్తకం అనే సంస్థ 20 సంవత్సరాలుగా చేస్తున్న కృషి ఎనలేనిదని సామాన్య శాస్త్రం కందుకూరి రమేష్ బాబు అన్నారు. బాల సాహిత్యం కోసం పరితపిస్తున్న మంచి పుస్తకం సంస్థ స్థాపించి 20 సంవత్సరాలు గడచిన సందర్భంగా వారిద్వారా వచ్చిన పలు పుస్తకాల నుంచి కొన్ని సంకలనాలతో వలేటి గోపీచంద్ రూపొందించిన పిల్లల వాకిట్లో తేనెపొద్దు మంచి పుస్తకం-రెండు దశాబ్దాలు అనే పుస్తకాన్ని మిసిమి పత్రిక సంపాదకులు వల్లభనేని అశ్వినీ కుమార్ ఆవిష్కరించారు. సోమవారం దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్ ఎస్‌వి పాపయ్య గుప్తా హాల్‌లో రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌బాబు మాట్లాడుతూ మంచి పుస్తకం నిర్వాహకులు కొసరాజు సురేష్ సమాజంలో పిల్లల కోసం ఎన్నో పుస్తకాలను తెచ్చారని, ముఖ్యంగా గడ్డిపరకతో విప్లవం అనువాద పుస్తకంతో సమాజంలో కొత్త మార్పుకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై పుస్తకాలు తీసుకువస్తే బాగుంటుందని కోరారు. ఆవిష్కర్త వల్లభనేని అశ్వినీ కుమార్ మాట్లాడుతూ బాల సాహిత్యం కోసం సురేష్ పడుతున్న శ్రమ, ప్రచురణల్లో ఆయన వ్యక్తిత్వం అందరికీ ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో మంచి పుస్తకం ట్రస్టీ కొసరాజు సురేష్, ఆత్మీయ అతిథులు చెన్నూరు సీతారాంబాబు, వలేటి గోపీచంద్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, తదితరులు

ఎస్సీ వర్గీకరణపై సీఎంకు స్పష్టత లేదు

● మందకృష్ణ మాదిగ

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా లేరని, ఎస్సీ రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, మాదిగలకు నామినేటెడ్ పదవి ఇస్తామనడం హాస్యాస్పదమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈమేరకు సికింద్రాబాద్‌లోని లీప్యాలెస్‌లో కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నాయకుడు కిషన్‌మాదిగ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మాదిగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ, కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో మాదిగలకు టికెట్ కేటాయించకుండా అన్యాయం చేశారని అన్నారు. ఓటు రూపంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆ పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో స్పష్టంగా లేరని అన్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేకి అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అజిత్, శ్రీకాంత్, పరశురాం, ఇటుక శ్రీకిషన్, సునీల్, మధుకర్, నర్సింహ, రాజు పాల్గొన్నారు.



బస్తీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

మంచినీటి సమస్యకు చర్యలు

● కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మంచినీటి సమస్యను అధిగమించేందుకు త్వరలో అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెంకటేశ్వరనగర్‌కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. శ్రీవెంకటేశ్వరనగర్, కెవిఎల్ టవర్స్ పరిసర ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని ఫిర్యాదులు రావడంతో ఆమె సోమవారం బస్తీలో పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నీటి సరఫరా లోపాల విషయంలో ఇప్పటికే పలు మార్లు అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. కొన్ని చిన్న పాటి ఇబ్బందులు ఉన్నాయని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. జలమండలి ఎండీని కూడా కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు.

కారులో యాచకుడి మృత దేహం

బంజారాహిల్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసి ఉన్న కారులో యాచకుడి మృత దేహం లభించింది. బంజారాహిల్స్‌రోడ్డు నంబరు 11 దావూద్ జంగ్ కాలనీ నివాసముండే సయ్యద్ జునైద్ ఇర్ఫాన్ వ్యాపారి. తన కారు బ్యాటరీ చెడిపోవడం, తలుపులు పనిచేయకపోవడంతో వారం రోజులుగా వాడకుండా పార్కింగ్‌లో పెట్టాడు. ఈ నెల 14న కారులో ఎవరో ఉన్నట్టు పరిశీలించగా ఓ వ్యక్తి స్పృహ తప్పి కనిపించాడు. వెంటనే బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అతను మృతి చెందినట్టు తేలింది. విచారణలో మృతుడు జాన్ అనే యాచకుడని తెలిసింది. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... రహ్మత్‌నగర్ చర్చిగల్లీలో నివాసం ఉండే జె.అశోక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతని భార్య ఓ ప్రవేట్ సంస్థలో హౌస్ కీపింగ్ పని చేస్తుంటుంది. వీరి కుమారుడు అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. నాలుగు నెలల క్రితం అశోక్ డ్రైవర్ పని మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తరచూ ఇంట్లో భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఆదివారం ఉదయం భార్య విధులకు వెళ్లగానే ఇంట్లోనే చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే ఇంట్లో నివాసం ఉండే చంద్రశేఖర్ కిటికీలోంచి చూసి పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మిబల్ రెడ్డి

శ్రీరామ నవమికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

సనత్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ హనుమాన్ దేవస్థానంలో ఏప్రిల్ 17న శ్రీరామనవమి వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్ రెడ్డి ఆహ్వానించారు. సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ సీతారామచంద్రమూర్తి వివాహ పత్రికను అందజేసి వేడుకలకు తప్పకుండా రావాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే తలసాని ఈ కల్యాణ వేడుకలలో పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి ఆలయ ప్రధాన అర్చకులు పరుశురాం రవీంద్ర చార్యులు గణేష్, అర్చకులు ఆలయ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్ బ్రహ్మశంకర్‌నగర్‌లోని బ్రంహ్మంగారి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభం పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, తదితరులు.

-యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా సోమవారం ఇతర అధికారులతో కలిసి శ్రీరామనవమి శోభాయాత్ర ముగింపు ప్రాంగణం అయిన సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయమశాల వద్ద ఏర్పాట్లను డీసీపీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో శోభయాత్రను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. తాగునీరు, రోడ్లపై చెత్త తొలిగింపు, డ్రైనేజీ సమస్యలు లేకుండా, రోడ్లపై గుంతలు లేకుండా, ఎలక్ట్రిక్ వైర్ల తొలగింపు తదితర అంశాలపై ఏర్పాట్లు చేశామన్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చత్రి వద్ద ఈ శోభాయాత్ర బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి సిద్దంబర్ బజార్, ఏంజే మార్కెట్, పుత్లిబౌలి, కోఠి ఆంధ్ర బ్యాంక్ చౌరస్తా మీదుగా హనుమాన్ వ్యాయమశాలకు రాత్రి చేరుకుంటుందని అన్నారు. యాత్ర సందర్భంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నిర్వాహకులు కూడా పోలీసులకు సహకరించాలని డీసీపీ కోరారు. శోభాయాత్రకు వచ్చే వాహనాలు వెడల్పు ఎక్కువ ఉండకుండా చూడాలని... పలు చోట్ల మెట్రో పిల్లర్లు ఉండటం వల్ల విగ్రహాల ఎత్తు 20 అడుగుల లోపు ఉండేలా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 700 మంది సివిల్ పోలీసుల తోపాటు 12 ప్లాటున్ల ఏఆర్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిర్వాహకులు వీలైనంత త్వరగా శోభాయాత్ర నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏసీపీ సుధాకర్, సీఐలు లింగేశ్వర్, శ్రీనివాసరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ గిరిధర్, తదితరులు



క్రీడాకారులతో శ్రీలత

శాట్స్ వేసవి శిబిరాలు ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) వేసవి శిక్షణ శిబిరాలు నగరంలో ప్రారంభమయ్యాయి. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలోని సైక్లింగ్ వెలోడ్రోమ్‌లో శాట్స్ డిప్యూటీ డైరెక్టర్ (పే అండ్ ప్లే) శ్రీలత సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. 45 రోజుల పాటు జరగనున్న ఈ సమ్మర్ క్యాంప్‌ను వర్ధమాన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. సైక్లింగ్, తైక్వాండో, యోగా, స్కేటింగ్, బాక్సింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సైక్లింగ్ వెలోడ్రోమ్ అడ్మినిస్ట్రేటర్ నందకిశోర్ గోకుల్, కోచ్‌లు పాల్గొన్నారు.



శాట్స్ సమ్మర్ క్యాంప్

శాట్స్ వేసవి శిబిరాలు ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) వేసవి శిక్షణ శిబిరాలు నగరంలో ప్రారంభమయ్యాయి. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలోని సైక్లింగ్ వెలోడ్రోమ్‌లో శాట్స్ డిప్యూటీ డైరెక్టర్ (పే అండ్ ప్లే) శ్రీలత సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. 45 రోజులపాటు జరగనున్న ఈ సమ్మర్ క్యాంప్‌ను వర్ధమాన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. సైక్లింగ్, తైక్వాండో, యోగా, స్కేటింగ్, బాక్సింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ వెలోడ్రోమ్ అడ్మినిస్ట్రేటర్ నందకిశోర్ గోకుల్, కోచ్‌లు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో
రాష్ట్ర బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్

ఇంటింటికీ ఎన్నికల ప్రచారం

తిరుమలగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బొల్లారం జనప్రియ బంగ్లోస్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, జ.వి నర్సింగ్ రావు, ధనంజయ చారి, వార్డ్-8 బీజేపీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ముదిరాజ్, జైనపల్లి శ్రీకాంత్, దుర్గా ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి) : వ్యక్తిగత కారణాల కారణంగా ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 35ఏళ్ల యువకుడు వ్యక్తిగత కారణాల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు బూడిద రంగు షాట్ ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు.

మహిళను వేధించిన ఆటోడ్రైవర్‌కు ఏడురోజుల జైలుశిక్ష



షేక్ నదీమ్ ఆలీ

బౌద్ధనగర్, ఏప్రిల్15(ఆంధ్ర జ్యోతి): ఓమహిళను వేధించిన ఆటో డ్రైవర్‌కు ఏడురోజులు జైలుశిక్ష పడిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం పద్మారావునగర్‌కు చెందిన ఓ మహిళ గత నెల 27వ తేదీ రాత్రి పదకొండున్నర గంటల సమయంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తుంది. తుకారాంగేట్‌కు చెందిన ఆటోడ్రైవర్ షేక్ నదీమ్ ఆలీ(22) మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. మహిళ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న పోలీసులు నదీమ్‌ఆలీపై ఈ-పెట్టి కేసును నమోదు చేసి సోమవారం సికింద్రాబాద్‌లోని 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కె.రవిశంకర్ ముందు హాజరు పర్చారు. నిందితుడికి ఏడురోజుల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.



చైన్ స్నాచర్ అరెస్టు వివరాలను
వెల్లడిస్తున్న లాలాగూడ పోలీసులు

చైన్ స్నాచర్ అరెస్టు

● బైకు, బంగారు గొలుసు స్వాధీనం

అడ్డగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తార్నాక ఏరియాలో ఓ వ్యక్తి మెడలో బంగారు గొలుసు తెంపుకుని పారిపోయి తప్పించుకుతిరుగుతున్న నిందితుడిని లాలాగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సోమవారం లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ రమేష్ గౌడ్, ఎస్సైలు నాగరాజు, షాహేద్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాక బస్టాపు వద్ద ఈనెల 13న ఓ వ్యక్తి నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా ఆ సమయంలోనే ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ తౌసిఫ్ ఫెూడా (19) అనే వ్యక్తి అతని మెడలో నుంచి బంగారు గొలుసు, సెల్‌ఫోన్ లాక్కుని బైకుపై పారిపోయాడు. వెంటనే బాధితుడు లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించి ఎట్టకేలకు సోమవారం తార్నాక ఏరియాలో అనుమానస్పదస్థితిలో తిరుగుతున్న నిందితుడిని పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి ఇతని వద్ద నుంచి 10 గ్రాముల బంగారు గొలుసు, బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సులువుగా డబ్బు సంపాదించేందుకు జల్సాలకు అలవాటు పడ్డాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

నివేదితను భారీ మెజారిటీతో గెలిపించాలి

తిరుమలగిరి ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలను శ్రీధర్ రెడ్డి కోరారు. వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం 7వ వార్డ్ మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కంటోన్మెంట్ నియోజకవర్గంను దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఆయన కూతురు నివేదిత ఉపఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, మాజీ బోర్డ్ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీతో పాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్

ట్రాఫిక్ సమస్యల కట్టడికి రంగంలోకి పోలీసులు



సికింద్రాబాద్ చౌరస్తాలో ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు, ఏసీపీ శంకర్ రాజు

సికింద్రాబాద్ ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. సమస్యలకు గల కారణాలపై అధ్యయనం చేయడానికి స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు.

అడ్డగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ రంగారావు, ఏసీపీ శంకర్‌రాజు ఈ సందర్భంగా హెచ్చరించారు. సికింద్రాబాద్‌లో ప్రధాన కూడళ్లు, ముఖ్యంగా సంగీత్ చౌరస్తా వద్ద ఉదయం, సాయంత్రం సమయాలలో ప్రతినిత్యం విపరీతమైన రద్దీని తలపిస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై అదనపు డీసీపీ రంగారావు, నార్త్‌జోన్ ఏసీపీ శంకర్‌రాజులు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులకు పలు సూచనలు చేశారు.

ఒలిఫెంట బ్రిడ్జి వద్ద అదనపు కానిస్టేబుళ్లు

ఉప్పల్ మీదుగా ఆలుగడ్డ బావి రైల్వే క్వార్టర్ నుంచి సికింద్రాబాద్ ఒలిఫెంట బ్రిడ్జి మీదుగా గాంధీ ఆస్పత్రి ముషీరాబాద్ వైపు వెళ్లే వాహనాల కారణంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు కార్లు, బైకులు వ్యాపారం పనినిమిత్తం వెళుతున్న ఆటో ట్రాలీలు ఇలా అనేక రకాల వాహనాలు ఒలిఫెంట బ్రిడ్జి మీదుగా ముషీరాబాద్ వైపు వెళుతున్నప్పటికీ చిలకలగూడ చౌరస్తా (ఒలిఫెంట బ్రిడ్జి) వద్ద ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఉదయం, సాయంత్రం వేళలో అదనపు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కానిస్టేబుళ్లు రోడ్లపైనే ఉంటూ క్లియర్ చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. నో ఎంట్రీ ప్రాంతంలో వాహనాలు రాకపోకలు సాగిస్తే, ఆ వాహనాలను వెంటనే తనిఖీలు చేసి ఉన్నతాధికారులకు తెలపాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం. ఇష్టం వచ్చినట్లుగా రెడ్ సిగ్నల్ పడ్డప్పటికీ రాకపోకలు సాగించడం వంటి కేసులు చాలా చూశాం. మీ భద్రత కోసం రోడ్లపైనే ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారని ట్రాఫిక్ డీసీపీ రంగారావు తెలిపారు.

ట్రాఫిక్ కానిస్టేబుళ్ల ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్నాం : ఏసీపీ శంకర్ రాజు

మండుటెండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్ల ఇబ్బందులు తెలుసుకునే బాధ్యత మాకు ఉంది. హైద్రాబాద్ నగరం కంటే సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోయింది. ఉప్పల్ హబ్సిగూడ, తార్నాక నుంచి హైద్రాబాద్ బేగంపేట్ వైపు వెళ్లే భారీ వాహనాలు, ఇతర వాహనాలు సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తా మీదుగా వెళ్ళాల్సి ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళలో కార్యాలయాల నుంచి రాకపోకలు సాగించే కార్లు, బైకులు, భారీ వాహనాలు సైతం సంగీత్ చౌరస్తా మీదుగా అమీర్‌పేట్, బోయిన్‌పల్లి బేగంపేట్ తిరుమలగిరి ప్రాంతాలకు వెళ్ళాలంటే సంగీత్ మీదుగా వెళ్ళాల్సి వస్తుంది. అయినప్పటికీ ఎక్కడా ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు మండుటెండలో డ్యూటీలు చేస్తున్నారు. సంగీత్ చౌరస్తా నాలుగు వైపులా విపరీతమైన రద్దీ ఉన్నందున ఇక్కడ ఏ సమస్య ఉందో తెలుసుకునే పనిలో ఉన్నాం.. ఎక్కడైతే ట్రాఫిక్ ఇబ్బందిగా మారితే పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా హెచ్చరించాలని సూచించాం.



తలసేమియా వ్యాధిగ్రస్తులతో బ్లడ్ వారియర్స్

ప్రతి ఒక్కరూ తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేయాలి : సందీప్ కావేటి

ఘనంగా బ్లడ్ వారియర్స్ ఫౌండేషన్ వార్షికోత్సవం

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానాన్ని చేయాలని బ్లడ్ వారియర్స్ ఫౌండేషన్ చైర్మన్ సందీప్ కావేటి పిలుపునిచ్చారు. సోమవారం సికింద్రాబాద్ ప్యారడైజ్ వద్ద గల లయన్స్ భవన్‌లో బ్లడ్ వారియర్స్ 4వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సందీప్ కావేటి మాట్లాడుతూ.... కరోనా కష్ట కాలమైన 2020లో స్థాపించబడిన బ్లడ్ వారియర్స్ ఫౌండేషన్ అనేక తలసేమియా ప్రభావిత కుటుంబాలకు బలమైన సహాయక వ్యవస్థగా మారిందని, బ్లడ్ బ్రిడ్జ్ ప్రాజెక్ట్‌తో, ఫౌండేషన్ తలసేమియా రోగులు ఆందోళన పడకుండా వారికి అవసరమైన రక్తమార్పిడిని క్రమం తప్పకుండా పొందేలా చేసిందని, 300 మంది దాతల మద్దతుతో 30 మంది రోగులకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో చిన్నారులచే శ్లోకాలు పఠించడం, నృత్య ప్రదర్శనలు, డ్రాయింగ్ నైపుణ్యాలను ప్రదర్శించడం వంటి ప్రదర్శనలతో కార్యక్రమం ఆహ్లాదభరితంగా కొనసాగింది. ఫౌండేషన్ వ్యవస్థాపకులలో ఒకరైన కృష్ణ వంశీ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఇలా ఒకరికొకరు సపోర్ట్‌గా ఉండడం సంతోషించదగ్గ విషయమని, మాది కేవలం పునాది మాత్రమే కాదని బలంగా పెరిగే కుటుంబమన్నారు. దాతల సహకారంతో నడుస్తున్న ఈ ఫౌండేషన్ గత నాలుగు సంవత్సరాలలో 1500 మందికిపైగా రక్తదాతలను నమోదు చేసిందని, 2000 మందికి పైగా తలసేమియాపై అవగాహన కల్పించిదని, నేషనల్ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ విషన్ ద్వారా నిరంతర విద్య, కమ్యూనిటీ సపోర్ట్, పాలసీ అడ్వకేసీ ద్వారా 2035 నాటికి భారతదేశంలో తలసేమియాని నిర్మూలించాలని లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు.

మానవత్వం చాటుకున్న కార్పొరేటర్



డ్రైవర్‌కి ప్రథమ చికిత్స అందజేస్తున్న కార్పొరేటర్

చిలకలగూడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గాయపడిన ఆటోడ్రైవర్‌ని ఆదుకుని మానవత్వం చాటుకుంది మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత. మెట్టుగూడ క్రాస్‌రోడ్స్‌లో శనివారం కదులుతున్న ఆటో యాక్సిల్ విరిగి పోవటంతో వాహనం అదుపు తప్పి చిన్న ప్రమాదం సంభవించింది. డ్రైవర్‌కి తీవ్ర గాయాలు కాగా, ప్రయాణీకులకి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సునీత సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందజేసి, తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్‌ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ సఫిల్‌గూడకి చెందిన వ్యక్తి అని కార్పొరేటర్ తెలిపారు.

శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా సోమవారం ఇతర అధికారులతో కలిసి శ్రీరామనవమి శోభాయాత్ర ముగింపు ప్రాంగణం అయిన సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయమశాల వద్ద ఏర్పాట్లను డీసీపీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో శోభయాత్రను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. తాగునీరు, రోడ్లపై చెత్త తొలిగింపు, డ్రైనేజీ సమస్యలు లేకుండా, రోడ్లపై గుంతలు లేకుండా, ఎలక్ట్రిక్ వైర్ల తొలగింపు తదితర అంశాలపై ఏర్పాట్లు చేశామన్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఛత్రి వద్ద ఈ శోభాయాత్ర బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి సిద్ధంబర్ బజార్, ఏంజే మార్కెట్, పుత్లిబౌలి, కోఠి ఆంధ్ర బ్యాంక్ చౌరస్తా మీదుగా హనుమాన్ వ్యాయమశాలకు రాత్రి చేరుకుంటుందని అన్నారు.



బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో
చీకట్లోనే పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీకట్లోనే పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లోనే పరీక్షలు రాస్తున్నారు. పాఠశాలకు కరెంట్ నిలిపివేసి ఐదురోజులైనా ప్రిన్సిపాల్ స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానిక నాయకులు కొందరు ఎంఈవోకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది.

అభివృద్ధిపథంలో నడిపిస్తున్న మోదీని గెలిపించండి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బన్సీలాల్‌పేట్ ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి

పద్మారావునగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కోట్ల మంది భారత ప్రజల భవిష్యత్‌ను నిర్ణయించే బీజేపీ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారం నేపధ్యంలో సోమవారం సాయం త్రం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని సీసీ నగర్ నుంచి వందలాది కార్యకర్తలతో కలసి బైక్ ర్యాలీ నిర్వహించారు. సీసీ నగర్ నుంచి పద్మారావు నగర్ పార్క్ వద్దకు చేరుకోగానే స్థానిక ప్రజలు ఆయనపై పూలవర్షం కురిపించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి కిషనరెడ్డి మాట్లాడుతూ....దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నరేంద్ర మోదీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశ భవిష్యత్తుకోసం మోడీ ఎన్నో చారిత్రాత్మక, విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నారని తెలిపారు. కమలం పువ్వుకు ఓటు వేసి, దోపిడి, కరెంటు కోతల, కుటుంబపాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ర్యాలీలో సికిందరాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు బి.శ్యాంసుందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

తిరుమలగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లో సోమవారం కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంను మల్కాజ్‌గిరి పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా లాల్‌బజార్‌కు చెందిన మురళీముదిరాజ్, భక్తవత్సలం, రాజేందర్ సింగ్, సాయియాదవ్, శివ, భరత్, ఆనంద్ జైన్ తదితరులు శ్రీగణేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

తిరుమలగిరిలో కాంగ్రెస్ మైనారిటీ నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలు 6 గ్యారంటీ ప్రభుత్వ పథకాలు. పార్లమెంటు మానిఫెస్టో గురించి వివరించి మే 13న జరిగే లోక్‌సభ, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో రెండు ఓట్లు చేతి గుర్తుకే వేయాలని అభ్యర్థించారు. స్థానిక మహిళలు పార్టీలో చేరారు. నాయకులు పట్నం రినీష్ రెడ్డి, సామ్సన్ సూర్యకాంత్, మైనారిటీ చైర్మన్ రేమండ్ హార్వర్డ్, మైనారిటీ కన్వీనర్ ఆంథోని, జోసఫ్, సయ్యద్, సిరాజ్, మైనారిటీ ఇన్‌చార్జి మైఖెల్ అబ్రహం, జమీల్, డెంజిల్ జోసఫ్, రజనీకాంత్, సందీప్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీని అలాగే ఉంచండి

● విద్యాశాఖ అధికారికి వినతి



విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న తల్లుల సంఘం, సీఆర్‌పీఎఫ్ సభ్యులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇంతకు ముందు ఉన్న పాఠశాల యజమాన్య కమిటీని కొనసాగించి అమ్మ ఆదర్శ కమిటీని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్‌పీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మారేడుపల్లి విద్యాశాఖ డిప్యూటీ ఈఓ బాలు నాయక్‌కు ఆ సంస్థ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.

సోమవారం అడ్డగుట్టలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తెలంగాణ తల్లుల సంఘం కన్వీనర్ జమున, సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ మారేడుపల్లి మండలం యాజమాన్య కమిటీ తెలంగాణ తల్లుల సంఘం బాలల హక్కుల పరిరక్షణ ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ కమిటీని రద్దు చేయాలని తాము నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నామని, చట్టబద్ధ పాఠశాల యజమాన్య కమిటీ స్థానంలో పొదుపు ఐక్య సంఘాల అధ్యక్షులు అమ్మ ఆదర్శ కమిటీలకు అధ్యక్షులుగా పెట్టి ఆ కమిటీ సభ్యులుగా పాఠశాలల బాలల తల్లిదండ్రులను సభ్యులుగా చేయడం ద్వారా నిర్ణయాల్లో తల్లిదండ్రుల పాత్ర నిర్వీర్యం అవుతుందన్నారు. ఇది రాజ్యాంగం ద్వారా తల్లిదండ్రులకు కల్పించిన హక్కును నిరాకరించడం, చట్టాన్ని ఉల్లంఘించడం అవుతుందని గుర్తుచేశారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009లో సెక్షన్ 21, 22 ప్రకారం పాఠశాల యజమాన్య కమిటీలకు ఎన్నికలు జరిపి వాటిని పటిష్టపరచాలన్నారు.

వెంటనే అమ్మ ఆదర్శ కమిటీలను రద్దు చేసి పాఠశాల యజమాన్య కమిటీలను పటిష్టపరచాలన్నారు. డిప్యూటీ ఈఓను కలిసినవారిలో సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ ప్రవీణ్, తల్లుల సంఘం సభ్యురాలు రాంలీల, పేరెంట్ కమిటీ సభ్యురాళ్లు లక్ష్మి, గోపి, కౌసల్య జేనీష్, ఎంపీ ఫౌండేషన్ కార్డనైజర్లు సువర్ణ, భాగ్య, క్రాంతి, రేఖ ఉన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణపై సీఎంకు స్పష్టత లేదు

● మందకృష్ణ మాదిగ

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా లేరని, ఎస్సీ రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, మాదిగలకు నామినేటెడ్ పదవి ఇస్తామనడం హాస్యాస్పదమని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈమేరకు సికింద్రాబాద్‌లోని లీప్యాలెస్‌లో కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకుడు కిషన్ మాదిగ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మాదిగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ, కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో మాదిగలకు టిక్కెటు కేటాయించకుండా అన్యాయం చేశారని అన్నారు. ఓటు రూపంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆ పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో స్పష్టంగా లేరని అన్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేకి అని, అందుకే పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా చేసిందే కాంగ్రెస్ అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అజిత్, శ్రీకాంత్, పరశురాం, ఇటుక శ్రీకిషన్, రొట్టెల సునీల్, మంద మధుకర్, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయం ముస్తాబు

తిరుమలగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీహనుమాన్ దేవాలయాన్ని ఈనెల 17న జరుగనున్న సీతారామ స్వామి కల్యాణోత్సవానికి దేవాలయంను ముస్తాబు చేస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వసంత నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న నేపధ్యంలో ప్రతీ రోజూ దేవాలయంలో హోమం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. కల్యాణానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. దేవాలయం ముందు రోడ్డు మీద కల్యాణం జరుగుతున్న నేపధ్యంలో ఒక రోజు బస్సులు బంద్ చేయాలని ఆర్టీసీ యాజమాన్యంతో అనుమతి పొందామని ఈఓ మహేందర్ తెలిపారు. అదేవిధంగా బొల్లారం పోలీసులకు కూడా సమాచారం అందజేశాం అని ఈఓ చెప్పారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు : ఈఓ మహేందర్ రెడ్డి

కల్యాణ మహోత్సవంకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని ఈఓ మహేందర్ రెడ్డి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

● సీఎం రేవంత్ రెడ్డి



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన కొత్త సంజీవరెడ్డి

మారేడుపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మంచినీటి సమస్య లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ..... కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న కాలనీ, బస్తీలలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కొత్త సంజీవరెడ్డి, బల్వంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కిషన్ రెడ్డికి దివ్యాంగుల సంఘం మద్దతు

అడ్డగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కష్టాలు పరిష్కరించిన సికింద్రాబాద్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కిషన్‌రెడ్డి తమ దివ్యాంగుల సంఘం నుంచి పూర్తి మద్దతు ఇస్తున్నామని దివ్యాంగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎంపీగా ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దివ్యాంగుల సమస్యలు కష్టాలను పరిష్కరించే దిశగా న్యాయం చేశారని ఈసారి ఎంపీ లోక్‌సభ బీజేపీ నుంచి పోటీలో ఉన్న కిషన్‌రెడ్డికి పూర్తి మద్దతు ఇస్తూ తమకు తామే న్యాయపరంగా ప్రచారం చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని, దివ్యాంగులు ఎవరైనా సరే కిషన్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఈఓ సత్‌విన్

చలివేంద్రం ఏర్పాట్లు అభినందనీయం

● నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

అడ్డగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండల కారణంగా ప్రజల దహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, కంపెనీలు ముందుకు రావాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. సోమవారం సికింద్రాబాద్ అశోక్ భూపాల్ చాంబర్ వద్ద "సత్యం వెంచర్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సీఈఓ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ కియోస్క్ చలివేంద్రాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న మండు టెండల్లో ప్రజలకు సౌకర్యంగా దహార్తిని తీర్చేందుకు సత్యం వెంచర్ ఇంజనీరింగ్ సర్వీసెస్ కంపెనీ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, కంపెనీలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కంపెనీ సీఈఓ సత్‌విన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏర్పాటుచేసేవాళ్లమని తెలిపారు. ఈ చలివేంద్రం ఈనెల 15న నుంచి జూన్ 15 వరకు కేంద్రంలో కియోస్క్ మినిరల్ వాటర్‌ను ప్రజలకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వడ్లమూడి శ్రీనివాస్, బేగంపేట్ ట్రాఫిక్ సీఐ పాపయ్యతో పాటు పలువరు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి తలసాని పరామర్శ



శ్రీనాథ్‌ను పరామర్శిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరి కోలుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడిని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సోమవారం బండిమెట్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శ్రీనాథ్ ఇంటికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి అందోళన చెందవద్దని, తాను ఉన్నాని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగులు, రాములు, మహేష్, సత్యనారాయణ, అమర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.